సాక్షి ఖమ్మం

బుధవారం । 4 । సెప్టెంబర్ । 2024



బీఆర్ఎస్ అండగా ఉంటుంది..

వరద బాధితులకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని మాజీ మంత్రి హరీశ్‌రావు. నేతలు భరోసా కల్పించారు.

8లో



వేగంగా విద్యుత్ పునరుద్ధరణ

వర్షాలు, వరదతో దెబ్బతిన్న విద్యుత్ సబ్ స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల మరమ్మతు పనుల్లో సిబ్బంది నిమగ్నమయ్యారు.

8లో

గరిష్టం / కనిష్టం 30° / 24°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరు జల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

కుటుంబ కేసుల పరిష్కారంలోనే సంతృప్తి



వీసీలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మం లీగల్: ఇతర అన్ని కేసుల కన్నా కుటుంబ బాంధవ్యాలకు సంబంధించి కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరిస్తే ఎక్కువ సంతృప్తి లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ తెలిపారు. ఆయన మంగళవారం సాయంత్రం సత్తుపల్లిలో జాతీయ లోక్ అదాలత్‌పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ జడ్జి మీరా ఖాసీం సాహెబ్‌తో ఈనెల 28న జరగనున్న జాతీయ లోక్ అదాలత్ ఏర్పాట్లను వివరించారు. ఈ మేరకు జిల్లా జడ్జి రాజగోపాల్ మాట్లాడుతూ భార్యాభర్తలు తగాదా పడితే విడాకులు, జీవనభృతి, క్రిమినల్, గృహహింస కేసులు నమోదవుతాయని.. వారిద్దరిని కలిపితే నాలుగు కేసులను పరిష్కరించినట్లు అవుతుందన్నారు. ఈమేరకు కుటుంబ తగాదా కేసులతోపాటు ప్రామిసరీ నోటు కేసులపై దృష్టి సారించాలని ఆదేశించారు.

మినీ హైడల్ ప్రాజెక్టులో పరిశీలన



ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీఈ, అధికారులు

కూసుమంచి: మండలంలోని పాలేరులో మినీ హైడల్ ప్రాజెక్టు(విద్యుత్ ఉత్పత్తి కేంద్రం)ను మంగళవారం విద్యుత్ సౌధ నుండి వచ్చిన సివిల్ ఇంజనీర్ల బృందం పరిశీలించింది. ఈ ప్రాజెక్టులోని యూనిట్లు తాజాగా పాలేరు రిజర్వాయర్ వరద ప్రవాహంతో నీట మునిగాయి. దీంతో పాటు ప్రాజెక్టుకు నీరు సరఫరా చేసే కాల్వ తెగిపోయింది. ఈ నేపథ్యాన సీఈ నారాయణరావు ఆధ్వర్యాన ప్రాజెక్టును పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. అంతేకాక ప్రాజెక్టు పునరుద్ధరణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

ఖమ్మంక్రైం: వినాయక మండపాల నిర్వాహకులు గణేష్ నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పోలీసు కమిషనర్ సునీల్ దత్ సూచించారు. ఈమేరకు విగ్రహ ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసులు అనుమతి తీసుకోవాలని తెలిపారు. మండపం ఏర్పాటు స్థలం, నిర్వాహకుల పేర్లు, నిమజ్జనం తేదీ తదితర వివరాలతో https://policeportal.tspolice.gov.in/index.htm ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈమేరకు దరఖాస్తు అనంతరం సంబంధిత పోలీసుస్టేషన్ నుంచి ఆన్‌లైన్ ద్వారా అనుమతి జారీ చేస్తారని తెలిపారు. అలాగే, లైట్లు, మైక్ తదితర అవసరాలకు విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలని సీపీ సూచించారు.

ఖమ్మం మార్కెట్‌కు ఐదు రోజులు సెలవులు

ఖమ్మంవ్యవసాయం: భారీ వర్షాలు, వరదల నేపథ్యాన చాంబర్ ఆఫ్ కామర్స్ కమిటీ అభ్యర్థన మేరకు బుధవారం నుంచి ఈనెల 8వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్టు మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వర్షాల కారణంగా నగరంలోని పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, మార్కెట్ కార్మికులు, దడవాయిలు, స్వీపర్లు, హమాలీలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ వారు మార్కెట్‌కు సెలవులు ఇవ్వాలని కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని, సోమవారం నుంచి యథావిధిగా కొనుగోలు జరుగుతాయని వివరించారు.

డీటీలకు తహసీల్దార్లుగా పదోన్నతి

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రవ్యాప్తంగా పలువురు డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతి కల్పించారు. అంతేకాక వీరిని జిల్లాలకు కేటాయిస్తూ భూపరిపాలన విభాగం చీఫ్ కమిషనర్ నవీన్‌మిత్తల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు జిల్లాకు ఐదుగురిని కేటాయించగా వీరికి కలెక్టర్ పోస్టింగ్ ఇవ్వనున్నారు. కాగా, భద్రాద్రి జిల్లాలో డీటీగా పనిచేస్తున్న కె.సునీత ఎలిజబిత్, మంచిర్యాలకు చెందిన జె.మాణిక్‌రావు, జయశంకర్ భూపాలపల్లికి చెందిన సీహెచ్.సుధాకర్, మహబూబాబాద్‌కు చెందిన పులి సాంబశివుడుతో పాటు ఖమ్మంలోనే విధులు నిర్వర్తిస్తున్న ఎం.డీ.తఫ్జల్ హుస్సేన్‌ను జిల్లాకు కేటాయించారు.

పరీవాహక ప్రాంతాన్ని ముంచెత్తుతూ ప్రవహిస్తున్న మున్నేరు



రెండు పర్యాయాలు...

రెండు పర్యాయాలుగా మున్నేరుకు వచ్చిన వరదతో ఖమ్మం నగరం, ఖమ్మంరూరల్ ప్రాంతంలో పలు కాలనీలు నీట మునిగాయి. గత ఏడాది జూలైలో మున్నేరుకు 30.7 అడుగుల మేర వరద రాగా.. దాదాపు 25 కాలనీలకు నష్టం వాటిల్లింది. రెండు రోజులక్రితం గతం కన్నా ఎక్కువగా 36.9 అడుగుల మేర వరద వచ్చింది. దీంతో మున్నేటికి రెండు వైపులా 50 కాలనీలు పూర్తిగా నీట మునిగాయి.

రిటైనింగ్ వాల్ లేకనే..

ముంచెత్తిన మున్నేరు

- యుద్ధప్రాతిపదికన 'రక్షణగోడ' నిర్మాణం చేయకపోతే నష్టమే
- మున్నేటికి ఇరువైపులా 33 అడుగుల గోడ నిర్మాణానికి నిధుల మంజూరు
- మూడు రోజుల క్రితం గరిష్టంగా 36.9 అడుగులకు చేరిన వరద
- రిటైనింగ్‌వాల్ ఎత్తు 50 అడుగులకు పెంచాలని స్థానికుల డిమాండ్

రిటైనింగ్ వాల్ లేకపోవడంతోనే మున్నేరు వాగు ఖమ్మం లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. ఈనెల 1వ తేదీన గరిష్టంగా 36.9 అడుగుల మేర వరద రావడంతో పరీవాహక ప్రాంతంలోని ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండలాలు కకావికలం అయ్యాయి. మున్నేటికి రెండువైపులా సుమారు 50కి పైగా కాలనీలు నీట మునిగి10 వేల మంది నిరాశ్రయులయ్యారు. వరద ప్రభావానికి రూ.వేల కోట్లలో నష్టం జరిగినట్టు అంచనా. అయితే రక్షణ గోడే ఉంటే వరద ముంపు తక్కువగా ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. – సాక్షిప్రతినిధి, ఖమ్మం

రిటైనింగ్ వాల్ ఉంటే..

గత ఏడాది మున్నేరుకు వరద వచ్చిన సమయాన ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం సిద్ధమైంది. ఖమ్మం నగరం వైపు 8.5 కి.మీ., ఖమ్మం రూరల్ వైపు 8.5 కిలోమీటర్లు.. వెరసి 17 కి.మీ. మేర రిటైనింగ్ వాల్‌ను 33 అడుగుల ఎత్తుతో నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకు రూ.690 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించినా పనులు మొదలుకాలేదు. ఈ క్రమంలోనే మరోసారి మున్నేరు వరద ముంచెత్తగా గత ఏడాది ఉపద్రవం నుంచి క్రమంగా కోలుకుంటున్న వారిపై పిడుగు పడినట్టయ్యింది.

ఎత్తు పెంచితేనే..

రిటైనింగ్ వాల్ 33 అడుగుల ఎత్తుతో నిర్మించాలని నిర్ణయించారు. గత ఏడాది మున్నేటికి 30.7 అడుగులు రావడం, గతంలో ఎన్నడూ అంతమేర వరద రాకపోవడంతో 33 అడుగులకు పరిమితమయ్యారు. అయితే ఈసారి వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలతో 36.9 అడుగుల వరకు వరద వచ్చింది. దీంతో 33 అడుగులు గోడ రక్షణ ఇవ్వదని.. ప్రభుత్వం పునరాలోచన చేసి రిటైనింగ్ వాల్ ఎత్తును 50 అడుగులకు మార్చి నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



బురదతో నిండిన సామగ్రిని చూసుకుంటున్న బొక్కలగడ్డ వాసులు



కాల్వొడ్డులో బైక్‌లకు మరమ్మతు చేస్తున్న మెకానిక్‌లు

ఇప్పట్లో కోలుకునేనా?

మున్నేరు వరద ముంచెత్తడంతో ఏర్పడిన నష్టం నుంచి బాధితులు ఎప్పుడు కోలుకుంటారో కూడా చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పుడిప్పుడే ఇళ్లకు చేరుతున్న వారు చెత్తాచెదారం తొలగించి సామగ్రిని శుభ్రం చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. ఈక్రమంలో గృహోపకరణాలన్నీ పనికి రాకుండా పోగా ఒక్కో ఇంట్లో రూ.లక్షల్లో నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. మరోపక్క వరద తాకిడికి గురైన బైక్‌లను సరిచేయడంలో మెకానిక్‌లు నిర్విరామంగా పనిచేయాల్సి వస్తోంది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఏడు మినహా నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం

ఖమ్మం సహకారనగర్: వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యాన జిల్లాలోని నాలుగు పాఠశాలలు, మూడు కేజీబీవీలు మినహా మిగతా అన్ని స్కూళ్లు బుధవారం తెరుచుకోనున్నాయని డీఈఓ సోమశేఖర శర్మ తెలిపారు. ఖమ్మంలోని జలగంనగర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, నయాబజార్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, సీతారాంపురం పాఠశాల, అయ్యగారిపేట పాఠశాలలతో పాటు సింగరేణి, కొణిజర్ల, బోనకల్ కేజీబీవీలు పునరావాస కేంద్రాలుగా ఉండడం, పరిసరాలు అపరిశుభ్రంగా మారడంతో వీటిని గురువారం ప్రారంభిస్తామని వెల్లడించారు. ఇదిలా ఉండగా మంగళవారం జిల్లాలోని పలు కేజీబీవీలు, పాఠశాలలను డీఈఓ సోమశేఖరశర్మ తనిఖీ చేసి పరిస్థితులపై ఆరా తీశారు. ఏఎంఓ రవికుమార్, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్)లో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జకీరుల్లా తెలిపారు. హిస్టరీ, గణితంతో మూడు చొప్పున, పొలిటికల్ సైన్స్‌లో రెండు, ఇంగ్లిష్, ఎకనామిక్స్, కామర్స్, బీసీఏ, డేటాసైన్స్, బయోటెక్నాలజీ ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 4వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా అన్ని సర్టిఫికెట్ల జిరాక్స్‌లు జత చేసిన దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అలా గే, 5వ తేదీన ఉదయం 10గంటలకు కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు. జనరల్, బీసీ అభ్యర్థులైతే పీజీలో 55శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని ప్రిన్సిపాల్ వెల్లడించారు.

డీసీసీబీ సీఈఓ సస్పెన్షన్

- రుణమాఫీ అమలులో అక్రమాలతో వేటు
- సీఈఓ తీరుతో అర్హులకు నష్టం.. అనర్హులకు పథకం

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంవ్యవసాయం: రుణమాఫీ నిధుల దుర్వినియోగంపై ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) అబీద్ ఉర్ రెహమాన్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర సహకార శాఖ డైరెక్టర్ అండ్ రిజిస్ట్రార్ పి.ఉదయ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన రుణమాఫీ పథకంలో పెద్దసంఖ్యలో రైతులకు అర్హత ఉన్నా అమలుకాలేదని 'సాక్షి'లో 'మాఫీ మాయ మంత్రం' శీర్షికన ఆగస్టు 18న కథనం ప్రచురితమైంది. బ్యాంక్ పరిధిలో 1.69 లక్షల మంది రుణమాఫీ కావాల్సి ఉన్నా మూడు విడతల్లో కేవలం 68 వేల మందికే వర్తించింది. ఈ నేపథ్యాన రాష్ట్ర సహకార శాఖ ప్రత్యేక దృష్టి సారించగా అవకతవకలు చోటు చేసుకున్నాయని తేలింది. ఈవిషయమై డీసీసీబీ సీఈఓను వివరణ కోరినా సంతృప్తికరమైన సమాధానం ఇవ్వలేదని భావించారు. ఈక్రమంలో సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ అవధానుల శ్రీనివాసులును విచారణ అధికారిగా నియమించారు.

అర్హత లేకున్నా సిఫారసు

విచారణ అధికారి డీసీసీబీ పరిధి 28 పీఏసీఎస్‌ల్లో రుణమాఫీకి అర్హత కలిగిన 154 మంది రైతులు ఖాతాలను పరిశీలించారు. ఈమేరకు అర్హత ఉందని తేలిన 149 మంది రైతుల వివరాలను అందించడంలో సీఈఓ విఫలమయ్యారని సమాచారం. అంతేకాక అర్హత లేని, మూసివేసిన రుణ ఖాతాలకు మాత్రం రూ.1,31,598 మేర రుణమాఫీ అమలుచేయాలని సీఈఓ సిఫారసు చేశారని తేలింది. ఇక ఓ కుటుంబానికి రూ.2లక్షలకు అదనంగా రూ.59,045, నిర్దేశించిన కాలాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఒకరికి రూ.1,17,553 మాఫీ చేయాలంటూ సీఈఓ సిఫారసు చేశారని గుర్తించారు. దీంతో సీఈఓను సస్పెండ్ చేస్తున్నట్లు సహకార శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఇదిలా ఉండగా ఉద్యోగులకు రూ.78లక్షల మేర ఇంక్రిమెంట్లు, ప్రోత్సాహకాల మంజూరు, పలువురికి బదిలీలు, పదోన్నతులు, ఆడిట్ చార్జీల పెంపు, రైతుల జీవిత బీమా ప్రీమియం ఖరారు అంశాల్లోనూ సీఈఓపై తీరుపై విచారణ కొనసాగుతోంది.

అశ్విని కుటుంబానికి న్యాయం చేస్తా..

- సీఎం రేవంత్‌రెడ్డి భరోసా
- గంగారం తండాలో నివాళులర్పించిన సీఎం, మంత్రి పొంగులేటి



అశ్విని, మోతీలాల్ చిత్రపటాల వద్ద నివాళులర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి, ఎంపీ బలరాం, ఎమ్మెల్యే రాందాస్ తదితరులు

కారేపల్లి: వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ అశ్విని, ఆమె తండ్రి మోతీలాల్ ఆకేరు వరదలో మృతి చెందడం బాధాకరమని.. వారి కుటుంబానికి న్యాయం చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి భరోసా కల్పించారు. కారేపల్లి మండలం గంగారంతండాకు చెందిన తండ్రీకుమార్తె ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పరామర్శించి అశ్విని, మోతీలాల్ చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. ఈసందర్భంగా అశ్విని తల్లి నేజీ మాట్లాడుతూ బంగారు భవిష్యత్ ఉన్న బిడ్డ, భర్త చనిపోవడంతో తాము దిక్కులేని వారమయ్యామని బోరున విలపించింది. బిడ్డ రాయపూర్‌లో ఉద్యోగం చేస్తూ ఆమెకు వచ్చే జీతంతో ఇల్లు కట్టుకుందామని ప్రారంభిస్తే ఇప్పుడు ఆగిపోయిందని వెల్లడించింది. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణానికి చేయూత ఇవ్వడంతో పాటు కుమారుడు అశోక్‌కు గ్రూప్–1 ఉద్యోగం ఇవ్వాలని, అశ్విని పింఛన్ తనకు ఇప్పించాలని కోరారు. దీంతో స్పందించిన సీఎం మాట్లాడుతూ హైదరాబాద్‌కు వస్తే అన్ని విషయాలు పరిశీలించి అండగా నిలుస్తామని తెలిపారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో పాటు బొర్రా రాజశేఖర్, పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్, బానోతు రామ్మూర్తి, అడ్డగోడ ఐలయ్య, మేదరి వీరప్రతాప్, ఇమ్మడి తిరుపతిరావు, పెద్దబోయిన ఉమాశంకర్, ఆలోతు ఈశ్వరీబాయి పాల్గొన్నారు.

తక్షణమే పంట నష్టం అంచనాలు

- వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



న్యూలక్ష్మీపురంలో మహిళలతో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

ముదిగొండ: వరదలకు కొట్టుకుపోయిన పంటలను తక్షణమే పరిశీలించి పంట నష్టం అంచనాలు రూపొందించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యవసాయాధికారులను ఆదేశించారు. ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురం, పండ్రేగుపల్లి, పండ్రేగుపల్లి తండాల్లో వరద ముంపునకు గురైన బాధితుల నివాసాలను మంగళవారం ఆయన పరిశీలించారు. న్యూలక్ష్మీపురం ఎస్సీ కాలనీలో వరద చేరిన ఇళ్లను పరిశీలించి స్థానికులకు ధైర్యం చెప్పారు. పండ్రేగుపల్లిలో మున్నేరు కరకట్ట తెగి ఇళ్లల్లోకి నీరు వచ్చిన డబుల్ బెడ్‌రూం కాలనీతో పాటు నీటమునిగిన వరిపొలాలను పరిశీలించారు. ముంపు బాధితులకు తక్షణ సాయంగా నిత్యావసర సరుకులను అందజేయాలని తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డిని భట్టి ఆదేశించారు. అలాగే, పండ్రేగుపల్లి తండాలో వరి పొలాలు, కోళ్లఫారంలకు నష్టం వచ్చిందని కొందరు.. రుణమాఫీ కాలేదని కొందరు ఆయన దృష్టికి తీసుకెళ్లగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అలాగే, విద్యుత్ సంబంధిత నష్టాలపై విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షించి పునరుద్ధరణపై ఆదేశాలు జారీచేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబుతో పాటు వనం ప్రదీప్తచక్రవర్తి, పసుపులేటి దేవేంద్రం, కందిమళ్ల వీరబాబు, పల్లపాటి కృష్ణ, ఎండీ.అజ్గర్, ఇలవల వీరారెడ్డి, బండారుపల్లి వీరబాబు, సత్యనారాయణ, వెంకట్, శిల్వరాజు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం..

- మున్నేరు సమీపాన యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు
- రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మం మయూరిసెంటర్: వరదలతో పంట నష్టపోయిన రైతులందరినీ ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వరదల కారణంగా ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో 1,53,278 ఎకరాల్లో పంటలకు నష్టం జరగగా ఖమ్మం జిల్లాలో అత్యధికంగా 68,345ఎకరాల్లో నష్టం జరిగిందని తెలిపారు. వరద తీవ్రత తగ్గగానే వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక ఇస్తారని చెప్పారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో రైతులు మళ్లీ పంట వేసుకునేందుకు సైతం విత్తనాలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఇక ఖమ్మంలోని మున్నేరు వరద తగ్గిన నేపథ్యాన బాధితులు ఇళ్లకు వచ్చి శుభ్రం చేసుకుంటున్నందున 24గంటల పాటు నీరందించాలని మేయర్, కమిషనర్‌ను ఆదేశించామన్నారు. అన్ని గ్రామపంచాయతీల నుండి ట్రాక్టర్లను రప్పించి నిర్విరామంగా పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నామని, బాధితులకు భోజనం సమకూరుస్తున్నామని తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతీ డివిజన్‌లో హెల్త్ క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. కాగా, బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్నప్పుడు కనీసం పరామర్శకు రాకపోగా.. ఇప్పుడు తమను విమర్శించడం సరికాదన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కాల్ సెంటర్‌ను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ఆపై వరద సహాయక చర్యలపై కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ తో సమీక్షించారు. అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, డీఆర్డీఓ సన్యాసయ్య పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం వన్‌టౌన్: భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్ దత్‌తో కలిసి పాలేరు నియోజకవర్గంలో భారీ వర్షాలు, నష్టంపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రహదారులు ఎక్కడెక్కడ దెబ్బతిన్నాయి, ఎంత మేర నిధులు కావాలో నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే, రాకాశితండా మినహా అన్నిచోట్ల విద్యుత్ పునరుద్ధరణ చేసినందున తండాలో కూడా బుధవారం సాయంత్రం నాటికి పనులు పూర్తిచేయాలని, అన్ని చోట్ల తాగునీటి సరఫరా ప్రారంభించాలని సూచించారు. అలాగే, విద్యుత్ శాఖ, పంట నష్టంపై అంచనాల రూపకల్పనపై సూచనలు చేశారు. రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల జారీకి 11న శిబిరం

ఖమ్మం సహకారనగర్: వరదతో సర్టిఫికెట్లు కోల్పోయిన వారి కోసం ఈనెల 11న(బుధవారం) కలెక్టరేట్‌లో ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. అయితే, విదేశాల్లో ప్రవేశాలు, తదితర అవసరాలకు అత్యవసరంగా సర్టిఫికెట్లు అవసరమైతే హాట్ లైన్ నంబర్ తెలియజేయాలని.. వారికి ప్రొవిజనల్ సర్టిఫికెట్లు సమకూరుస్తామని చెప్పారు. మిగతా వారు ఈనెల 11న జరిగే శిబిరానికి హాజరుకావాలని సూచించారు. పాస్‌పోర్ట్, విద్యార్హతలు తదితర సర్టిఫికెట్లు పోగొట్టుకున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

క్లుప్తంగా

పంటలను పరిశీలించిన డీఏఓ



దెబ్బతిన్న పైర్లను పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని మున్నేరు పరీవాహ ప్రాంతమైన రామన్నపేట సమీపాన దెబ్బతిన్న పంటలను మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య పరిశీలించారు. వరదల ప్రభావంతో దెబ్బతిన్న పంటల వివరాలతో నివేదిక సమర్పించాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు పర్యటిస్తున్నారు. ఈమేరకు డీఏఓ కూడా పర్యటించిన అధికారులకు సూచనలు చేశారు. అలాగే, రైతు వేదికలో జరుగుతున్న రుణమాఫీ కుటుంబ నిర్ధారణ ప్రక్రియను పరిశీలించారు. ఏడీఏ కొంగర వెంకటేశ్వర్లు, ఏఓలు కిషోర్‌బాబు, భాస్కర్, ఏఈఓ వెంకటేశ్వర్లు, రైతులు నరేష్, సూర్యం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో ట్రెయినీల సేవలు



బాధితుల సామాన్లు తరలింపులో సాహాయం చేస్తున్న ట్రెయినీలు

ఖమ్మంక్రైం: మున్నేరు ముంపునకు గురైన ప్రాంతాల్లో మంగళవారం జరిగిన సహాయక చర్యల్లో ఖమ్మం సీటీసీలో శిక్షణ పొందుతున్న 525మంది ట్రెయినీ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. బొక్కలగడ్డ, ధంసలాపురం కాలనీ తదితర ప్రాంతాల్లో బాధితుల సామగ్రిని చేర్చడం తదితర పనుల్లో పాలుపంచుకున్నారు. ఈమేరకు సీపీ సునీల్‌దత్ వారికి సూచనలు చేశారు.

ఆలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు



గర్భగుడిలో తవ్వకాలు జరిపిన ఆనవాళ్లు

కూసుమంచి: మండలంలోని పెరికసింగారం–రాజుపేట మధ్య ఉన్న శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం రాత్రి దుండగులు తవ్వకాలు చేపట్టారు. ఆలయానికి మంగళవారం ఉదయం వచ్చిన అర్చకులు శ్రీనివాసమూర్తి, స్వీపర్ సైదులు ఈ విషయాన్ని గమనించారు. దుండగులు గర్భగుడి ఎదురుగా ఉన్న ప్రాకారాన్ని పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించారు. ఆపై గర్భగుడి దర్వాజా ముందు ఉన్న పెద్ద బండరాయిని పక్కకు తొలగించి తవ్వకాలు చేపట్టారు. కాగా, దుండగులు గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు అనుమానిస్తున్నారు. ఇదే ఆలయంలో గతంలోనూ గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ఆలయ ఈఓ శ్రీకాంత్ ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో చోరీ ఘటనల్లో నిందితుడు

నేలకొండపల్లి: కోళ్లగూడులో ఉన్న నాటు కోళ్లను చోరీ చేసి విక్రయిస్తున్న వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నేలకొండపల్లికి చెందిన పిట్టల శంకర్ నివాసంలోని గూడు నుంచి ఓ వ్యక్తి మూడు నాటు మూడు కోళ్లను ఎత్తుకెళ్లి ఓ చికెన్ దుకాణంలో విక్రయించాడు. ఆపై వీరభద్రం ఇంటి ముందు షట్టర్ పగలగొడుతుండగా యాజమాని మేల్కోవడంతో పరారయ్యాడు. ఆతర్వాత బిక్షం ఇంటి ముందు ఉన్న సైకిల్ తీసుకెళ్లి విక్రయించాడు. దీంతో స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. అంతేకాక పిట్టల శంకర్ ఇంటి వద్ద సీసీ కెమెరాలోనూ చోరీ విషయం నమోదు కావడంతో నిందితుడిని పోలీసులకు అప్పగించారు.

సైదాబీ మృతదేహం లభ్యం

కూసుమంచి: మండలంలోని పాలేరు రిజర్వాయర్ వరద ప్రవాహానికి ఆదివారం నాయకన్‌గూడెం సమీపాన ఇటుకలు తయారుచేసే షేక్ యాకూబ్ – సైదాబీతో పాటు వీరి కుమారుడు షరీఫ్ గల్లంతైన విషయం విదితమే. ఇందులో షరీఫ్‌ను పోలీసులు, స్థానికులు అదేరోజు రక్షించారు. ఇక యాకూబ్ మృతదేహం సోమవారం లభ్యం కాగా, ఆయన భార్య సైదాబీ మృతదేహాన్ని జక్కేపల్లి ప్రాంతంలో గుర్తించారు. దంపతులిద్దరూ వరదలో చిక్కుకుని మృత్యువాత పడడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,900	5,000
మిర్చి	17,800	8,000
మిర్చి తాలు	9,000	9,000
ఏసీ మిర్చి	19,400	9,000
ఏసీ తాలు	9,000	7,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.14,392

బీఆర్ఎస్ అండగా ఉంటుంది..

- మాజీ మంత్రి హరీశ్‌రావు
- మున్నేరు బాధితులకు బీఆర్ఎస్ బృందం పరామర్శ
- కరుణగిరి, బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్‌లో పర్యటన



వరద బాధితులను వారి ఇళ్లకు వెళ్లి పరామర్శిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మం రూరల్: మున్నేరు వరదతో నష్టపోయిన వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు భరోసా కల్పించారు. ముంపు ప్రాంతాలైన కరుణగిరి, వెంకటేశ్వరనగర్, జూబ్లీపుర, బొక్కలగడ్డలో ఆయన మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి, జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, వివేకానంద, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావుతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా బాధితులను ఓదార్చి సమస్యలు తెలుసుకున్నారు. ఈమేరకు పలువురు ప్రభుత్వం అందించే వరద సాయం రూ.10వేలు ఏ రకంగా ఆదుకోవని.. పరిహారం పెంచేలా ప్రభుత్వంపై కోరారు. సర్వస్వం కోల్పోయిన తమకు తాగునీరు, ఆహారం సైతం ఇప్పటి వరకు సరిగా అందలేదని వాపోయారు. గతంలోనే తమకు అన్ని సకాలంలో అందాయని చెప్పగా.. వరద సమాచారాన్ని ముందస్తుగా ఇవ్వడంతో యంత్రాంగం విఫలమైందని వాపోయారు. ఈ సందర్భంగా నేతలు పలువురి ఇళ్లలోకి వెళ్లి బురదలో కూరుపోయిన వస్తువులను పరిశీలించారు. అనంతరం మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ సీఎంగా కేసీఆర్ ఉన్నప్పుడే మున్నేరుకు రిటైనింగ్ వాల్ మంజూరు చేశామని, అది పూర్తయితే ఇబ్బందులు ఉండవన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి అయినా బాధితులకు మెరుగైన నష్టపరిహారం అందేలా చూస్తామని తెలిపారు. అనంతరం పువ్వాడ ఫౌండేషన్ తరఫున బాధితులకు నిత్యావసర సరుకుల కిట్లు అందజేశారు. మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మదన్‌లాల్, కొండబాల కోటేశ్వరరావు, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎర్రోళ్ల శ్రీనివాస్, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, నేతలు పగడాల నాగరాజు, కన్నం ప్రసన్నకృష్ణ, తోట రామారావు, దేవభక్తుని కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన పువ్వాడ, వద్దిరాజు

ఖమ్మంక్రైం/ఖమ్మం మయూరిసెంటర్: బీఆర్ఎస్ నేతలు, వాహనాలపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ కార్యకర్తలపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కోరారు. ఈ మేరకు సీపీ సునీల్‌దత్‌కు ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీష్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ముంపు బాధితులను పరామర్శిస్తుండగా కాంగ్రెస్ శ్రేణులు రాళ్ల దాడికి దిగడంతో వాహనం అద్దాలు ధ్వంసమయ్యాయని, తమ పార్టీ నేత సంతోష్‌రెడ్డి గాయపడ్డాడని తెలిపారు. ఆ తర్వాత కాంగ్రెస్ నేతలపై త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ రమణమూర్తికి బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు మిక్కిలినేని నరేంద్ర, బాణా లక్ష్మణ్, షేక్ యాకూబ్‌బాషా, ఎండీ.షకూర్, షేక్ యూసఫ్, నిమ్మలబోయిన సురేష్, భద్రుల్లాపై ఫిర్యాదు చేశారు. తొలుత దాడిలో గాయపడి మమత ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంతోష్‌రెడ్డిని హరీశ్‌రావు, పువ్వాడ, జగదీశ్వర్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో పాటు పాడి కౌశిక్‌రెడ్డి, వివేక్‌గౌడ్, సండ్ర వెంకటవీరయ్య, లింగాల కమల్‌రాజ్, పగడాల నాగరాజు తదితరులు పరామర్శించారు.

సహాయక చర్యల్లో పాల్గొన్న ఎంపీ రఘురాంరెడ్డి



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో మున్నేటి వరదతో ముంపునకు గురైన ప్రాంతాల్లో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మంగళవారం పర్యటించారు. ఖమ్మం కవిరాజ్‌నగర్‌లో ఇంటింటికీ వెళ్లి మాట్లాడిన ఆయన బురదతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెప్పగా అగ్నిమాపక శాఖ డీజీ వై. నాగిరెడ్డితో ఫోన్‌లో ఫైరింజన్లు సమకూర్చాలని సూచించారు. ఆ వెంటనే ఫైరింజన్లు చేరుకోగా పనులు మొదలయ్యాయి. ఆతర్వాత కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో మాట్లాడిన ఎంపీ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సహాయక చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం ఖమ్మం రూరల్ మండలంలోని కస్నా తండా, వాల్యా తండా, తీర్థాలలో పర్యటించిన ఎంపీ దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అలాగే, పలువురికి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. అండగా ఉంటామని అభయం ఇచ్చారు. వరద ఉధృతికి కొట్టుకుపోయిన ములకలపల్లి వంతెన, దెబ్బతిన్న పంటలను స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. కాగా, వరద మొదలుకాగానే రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టిందని ఎంపీ రఘురాంరెడ్డి తెలిపారు. జిల్లా మంత్రులు, తాను, అధికార యంత్రాంగమంతా నిరంతరం శ్రమిస్తుండగా, ముఖ్యమంత్రి కూడా పర్యటించారని చెప్పారు. ఇలాంటి సమయంలో రాజకీయ లబ్ధి కోసం విపక్షాలు తప్పుడు వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబుతో పాటు నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, కొప్పుల చంద్రశేఖర్, ఉత్తేజ్ నాయక్, మద్ది కిషోర్‌రెడ్డి, పాపానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో కలెక్టర్ పరిశీలన



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సహకారనగర్: మున్నేరు వరద ముంపు ప్రాంతాలైన బొక్కలగడ్డ, మంచికంటినగర్, వెంకటేశ్వరనగర్, బతుకమ్మ ఘాట్ రోడ్డు, ప్రకాష్ నగర్, మోతీనగర్, వినాయక ఘాట్ తదితర ప్రాంతాల్లో సహాయక చర్యలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మంగళవారం పరిశీలించారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్‌తో కలిసి ఆయన ఇంటింటికి తిరుగుతూ పరిస్థితులను పరిశీలించి బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎవరూ అధైర్యపడొద్దని, ప్రభుత్వం తరఫున అన్నివిధాలుగా అండగా నిలుస్తామని చెప్పారు. ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందిస్తుండగా, వీధుల్లో బురదను శానిటేషన్ సిబ్బంది శుభ్రం చేస్తున్నారని తెలిపారు. ఆతర్వాత ఆస్తి నష్టం అంచనా వేసేందుకు పర్యటిస్తున్న ఉద్యోగులతో మాట్లాడిన కలెక్టర్ సూచనలు చేశారు. కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎంపీ వద్దిరాజు చేయూత



వాహనాలను ప్రారంభిస్తున్న ఎంపీ, తదితరులు

ఖమ్మం మయూరిసెంటర్: మున్నేటి వరదతో నష్టపోయిన వారికి రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అండగా నిలిచారు. ఈమేరకు మాజీ మంత్రులు, బీఆర్ఎస్ నేతలతో కలిసి ఖమ్మంలో ముంపునకు గురైన ప్రాంతాలను సందర్శించి బాధితులను పరామర్శించారు. అలాగే, సోమవారం సాయంత్రం ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లోని బాధితుల ఇళ్లకు బీఆర్ఎస్ శ్రేణుల ద్వారా నిత్యావసరాలను పంపించారు. ఈమేరకు సరుకులు తీసుకెళ్తున్న వాహనాలను ఎంపీ ప్రారంభించారు. ఎమ్మెల్సీ టి.రవీందర్‌రావు, జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, నాయకులు శీలంశెట్టి వీరభద్రం, బెల్లం వేణు, తోట వీరభద్రం, గుండ్లపల్లి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం రూ.10లక్షల విరాళం



మంత్రి సమక్షాన కలెక్టర్‌కు రూ.10 లక్షల చెక్కు ఇస్తున్న గ్రానైట్ అసోసియేషన్ నాయకులు

ఖమ్మంఅర్బన్: మున్నేరు వరద బాధితుల సహాయక చర్యల కోసం ఖమ్మం గ్రానైట్ అసోసియేషన్ భారీ విరాళం ప్రకటించింది. ఈమేరకు మంగళవారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షాన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు రూ.10లక్షల చెక్కు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరావు, సాధు రమేష్‌రెడ్డి, గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణతో పాటు నల్ల శ్రీనివాస్‌రెడ్డి, దొడ్డ రాకేష్, నున్న నాగేశ్వరరావు, రియా

ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు అందుకున్న రవికుమార్



ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు అందుకుంటున్న రవికుమార్



ఉత్తమ రైతు అవార్డు అందుకుంటున్న రామారావు

వైరా: వైరాలోని కృషివిజ్ఞాన కేంద్రంలో ప్రోగాం కోర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ విస్తరణ శాస్త్రవేత్త అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో ఆయనకు సెంట్రల్ యూనివర్సిటీ వీసీ బీ.జే.రావు, వ్యవసాయ శాఖ కమిషనర్ ఎం.రఘునందరావు, వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ పి.రఘురాంరెడ్డి అవార్డు అందించారు. అంలాగే, వైరా మండలం వల్లాపురానికి చెందిన తుమ్మల రాణాప్రతాప్‌కు రాష్ట్ర ఉత్తమ రైతు అవార్డు అందుకున్నారు.

ఉత్తమ రైతుగా రామారావు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలం కోయచలకకు చెందిన చెరుకూరి రామారావు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వార్షికోత్సవ వేడుకల్లో ఉత్తమ రైతుగా అవార్డు అందుకున్నారు. ఆధునిక విధానాల్లో వ్యవసాయం చేస్తున్న ఆయనకు అవార్డు అందజేసి అభినందించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్



దయాగ్నస్టిక్ హబ్‌లో పరిశీలిస్తున్న కమిషనర్ కర్ణన్

ఖమ్మంవైద్యవిభాగం: ప్రస్తుత పరిస్థితుల్లో సీజనల్ వ్యాధుల ప్రబలే ప్రమాదమున్నందున అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వీ. కర్ణన్ సూచించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి మంగళవారం ఆయన ఖమ్మంలోని మంచికంటినగర్ తదితర వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. నష్టం వివరాలను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. మొబైల్ హెల్త్ బృందాలను ఏర్పాటుచేయగా ఇంటింటికి సిబ్బంది వచ్చి ఆరోగ్యం విషయమై సూచనలు చేస్తారని, అవసరమైన వారికి మందులు ఇస్తారని తెలిపారు. ఈ సందర్భంగా అక్కడ మొబైల్ బృందాల పనితీరును ఆయన పరిశీలించారు. ఆతర్వాత జిల్లా ప్రధాన ఆస్పత్రి తనిఖీ చేసిన కర్ణన్.. చికిత్స పొందుతున్న వారితో మాట్లాడారు. వైద్యాధికారులు నిరంతరం అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని కమిషనర్ ఆదేశించారు. కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సంపత్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సైదులు, జిల్లా ప్రధాన ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, ఆర్ఎంఓ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు



రోదిస్తున్న బాలుడు

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడురకు ఇద్దరు మంగళవారం కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన బుంగా లక్ష్మీచంద్, బండారు లాస్య గాయపడగా పీహెచ్‌సీలో వైద్యం చేయించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బెడద ఉన్నందున అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

కేజీబీవీని సందర్శించిన అధికారులు

కొణిజర్ల: మండలంలోని బస్వాపురం సమీపాన కస్తూర్బాగాంధీ బాలికల విదాలయంలో గోడలకు విద్యుత్ ప్రసరిస్తుందనే సమాచారంతో ఏఎంఓ కె రవికుమార్, ఎంఈఓ ఎం.శ్యాంసన్ మంగళవారం పరిశీలించారు. అప్పటికే పాఠశాల ఎస్‌ఓ సౌజన్య విద్యుత్ సరఫరా నిలిపివేయించినట్లు తెలిపారు. అయితే, త్వరగా మరమ్మతులు చేయించి గురువారం ఉదయం కల్లా బాలికలు హాజరయ్యేలా చూడాలని సూచించారు. కాగా, బాలికల్లో కొందరిని ఇక్కడే ఉంచడం, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకపోవడంపై ఎస్‌ఓను మందలించడమే కాక వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది.

బాధితులను ఆదుకోవడం ఉద్యోగుల బాధ్యత



మాట్లాడుతున్న టీఎన్జీవోస్ కోకన్వీనర్ శ్రీనివాస్

ఖమ్మం సహకారనగర్: అకాల వర్షాలతో సర్వం కోల్పోయిన నిర్వాసితులకు రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యాన ఒకరోజు వేతనాన్ని సీఎం సహయనిధికి అందించాలని నిర్ణయించడంపై జేఏసీ జిల్లా బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఖమ్మంలోని టీఎన్జీవోస్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీ నిర్ణయాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. టీఎన్జీవోస్ బాధ్యులుకొనిడెన శ్రీనివాస్, జెడ్ఎస్.జైపాల్, టీజీవోస్ అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రితో పాటు నాగిరెడ్డి, దేవరకొండ సైదులు, నాగమల్లేశ్వరరావు, నాగేశ్వరరావు, యలమద్ది వెంకటేశ్వర్లు, ఎస్.విజయ్, రంగారావు, జి.యాదగిరి, మన్సూర్, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, తాళ్లూరి శ్రీకాంత్, రవిచంద్ర, పూసపాటి శ్రీను పాల్గొన్నారు.

అన్నతో కలిసి భర్తపై దాడి

- చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం: కుటుంబ కలహాల కారణంగా అన్నతో కలిసి ఓ మహిళ తన భర్తపై దాడి చేయడమే కాక రోడ్డుపై పడేయడంతో తీవ్రంగా గాయపడిన ఆయన చికిత్స పొందుతూ మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం బిక్కుమల్లకు చెందిన మస్కపురం పర్వతాలు(38) మూడేళ్లుగా తిరుమలాయపాలెం మండలంలోని దమ్మాయిగూడెంలో గది అద్దెకు తీసుకుని సెలూన్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య భవాని, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా దంపతుల నడుమ వివాదాలు జరుగుతుండడంతో గత నెల 26న తిప్పారెడ్డిగూడెం నుంచి తన అన్న వెంకన్నను పిలిపించగా.. ఆయనతో కలిసి భవాని భర్త పర్వతాలును తీవ్రంగా కొట్టి రోడ్డుపై పడవేశారు. దీంతో పర్వతాలు పరిస్థితి విషమంగా మారడంతో ఆయన కుటుంబీకులు ఖమ్మం ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా సోమవారం రాత్రి మృతి చెందాడు. ఘటనపై పర్వతాలు భార్య భవానీతో పాటు ఆమె అన్న వెంకన్నపై హత్యానేరం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేగంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు



సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఈలు చౌహాన్, కిషన్, ఎస్ఈ సురేందర్

- చకచకా ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల మరమ్మతు
- సరఫరాలో అంతరాయాలను అధిగమించడంపై కసరత్తు

ఖమ్మంవ్యవసాయం: ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు, భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు ఎన్పీడీసీఎల్ రంగంలోకి దిగింది. జిల్లాలో విద్యుత్ వ్యవస్థకు సంబంధించి రూ.7.70 కోట్ల మేర నష్టం వాటిల్లిన విషయం విదితమే. ఈమేరకు సోమవారం జిల్లాకు వచ్చిన ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఎస్ఈ సురేందర్, అధికారులకు సూచనలు చేయడమే కాక మంగళవారం సీఈలు చౌహాన్, కె.కిషన్‌ను ఖమ్మం పంపించారు. దీంతో సీఈలు, ఎస్ఈల పర్యవేక్షణలో ఖమ్మం సర్కిల్ పరిధిలో విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేశారు. జలమయమైన సబ్‌స్టేషన్లలో దెబ్బతిన్న యంత్రాలను మరమ్మతు చేస్తుండగా, వరద ప్రాంతాల్లో కూలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల స్థానంలో కొత్తవి అమరుస్తున్నారు. మున్నేరు నది పరీవాహక ప్రాంతం, వాగులు, జలాశయాల వెంట వరద నీటికి ముంపునకు గురైన ఇళ్లు, పరిశ్రమల్లోనూ విద్యుత్ సరఫరా మొదలయ్యేలా చర్యలు చేపట్టారు. వరద ముంపునకు గురైన ఇళ్లలో మీటర్లు, స్విచ్ బోర్డులు పూర్తిగా దెబ్బతినడంతో ఇతర ప్రాంతాల సిబ్బందిని రప్పించి పనులు చేయిస్తుండగా డీఈలు, ఏడీఈలు, ఏఈలు పర్యవేక్షిస్తున్నారు.

చకచకా మరమ్మతు పనులు

విద్యుత్ పునరుద్ధరణ చర్యల్లో వేగం పెంచాం. దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల మరమ్మతు పనులను చేపడుతున్నాం. విద్యుత్ అంతరాయాలను తగ్గించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వరద ప్రాంతాల ప్రజలు గుర్తింపు పొందిన ఎలక్ట్రీషియన్‌తోనే మరమ్మతు పనులు చేయించుకోవాలి. ఏవైనా సమస్యలు తలెత్తితే విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకురావాలి.

– ఏ.సురేందర్, ఎస్ఈ, ఖమ్మం

ఆత్మహత్యకు యత్నించిన మహిళను కాపాడిన పోలీసులు



మహిళను ఒడ్డుకు చేర్చిన పోలీసులు

సత్తుపల్లిటౌన్: కుటుంబ కలహాల నేపథ్యాన ఓ మహిళ చెరువులోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు కాపాడిన ఘటన సత్తుపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. సత్తుపల్లి జవహర్‌నగర్‌కు చెందిన బి.సంజన తన భర్తతో తామర చెరువుకట్టపై గొడవపడగా క్షణికావేశంలో చెరువులోకి దూకింది. దీంతో స్థానికులు పట్టణ సీఐ టి.కిరణ్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన సూచనలతో సిబ్బంది చెన్నారావు, శ్రీనివాస్, ఇమ్రాన్, కరుణాకర్, రమాదేవి ఘటనా స్థలికి చేరుకుని సంజనను ఒడ్డుకు చేర్చి 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సకాలంలో వైద్యం అందించటంతో ఆమె ప్రాణాలతో బయటపడింది. ఈ మేరకు పోలీసులను స్థానికులు అభినందించారు.

భర్త చేతిలో భార్య హతం



రాధ (ఫైల్)

పాల్వంచరూరల్: వివాహిత హత్యకు గురైన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సంగం గ్రామానికి చెందిన కాయిత రాధ (28)కు మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న కాయిత రాముతో తొమ్మిదేళ్ల కిందట వివాహమైంది. అయితే, భార్యను అనుమానిస్తుండటంతో తాళలేక రాధ.. గత నెల 30న సంగం గ్రామానికి వచ్చింది. భర్త కూడా ఈ నెల 1వ తేదీన భార్య వద్దకు వచ్చాడు. రెండో తేదీ రాత్రి రాధ తలపై దిండును మోది, మెడ పిసికి హత్య చేసిన అనంతరం రాము పరారయ్యాడని మృతురాలి సోదరుడు ప్రసాద్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు. మృతురాలికి బాబు నిశిత్, పాప నిశిక ఉన్నారు.